www.kalamdaily.com
Follow on: Kalamtelugu
కలం
ప్రజల గళం...
20-02-2026, శుక్రవారం పేజీలు: 2

360°

SINGLE TOPIC

కుటుంబాలు.. రాజకీయాలు

# పాలిటిక్స్... ఫ్యామిలీస్ బ్రేకప్

కుటుంబాలను దూరం చేస్తున్న రాజకీయాలు
విభేదాలతో బయటకు వస్తున్న వారసులు



## కల్వకుంట్ల ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), శోభ దంపతులకు పిల్లలు కేటీఆర్, కవిత. 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారు. అప్పటి నుంచి ఆయన వెంట మేనల్లుడు హరీశ్ రావు ఉన్నారు. తర్వాత మరదలి కొడుకు సంతోష్ రావు.. కేటీఆర్, కవిత కూడా వచ్చి చేరారు. 2009లో సిరిసిల్ల నుంచి తొలిసారి కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలిచారు. కవిత 2006లోనే తెలంగాణ జాగృతి సంస్థను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. 2014లో తొలిసారి నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. హరీశ్ రావు 2004 నుంచి ఇప్పటి వరకు సిద్దిపేటలో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తను సీఎం అయ్యాక సంతోష్ రావును కేసీఆర్ రాజ్యసభ ఎంపీగా చేసుకున్నారు.

**విభేదాలు:** పార్టీలోని పరిస్థితులపై కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ లీక్ కావడంతో కల్వకుంట్ల కుటుంబంలోని విభేదాలు బయటపడ్డాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, పార్టీ సిల్వర్ జూబ్లీ మీటింగ్ గురించి వివరిస్తూ 2025 మే 2న కేసీఆర్‌కు కవిత లెటర్ రాశారు. అయితే అది మీడియాకు లీక్ అయింది. దీనిపై కవిత స్పందిస్తూ.. ''కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయి. నేను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న టైమ్‌లో బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. వాటిని నేను తీవ్రంగా వ్యతిరేకించాను” అని సంచలన ఆరోపణలు చేశారు. కవిత లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కోవడంతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైందని మరో వర్గం నేతలు విమర్శలు చేశారు.


**కవిత సస్పెన్షన్:** కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన నాటి నుంచి పార్టీలోని పరిస్థితులను కవిత ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు 2025 సెప్టెంబర్ 2న కేసీఆర్ ప్రకటించారు. ఆ మరుసటి రోజే బీఆర్ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేశారు.

**త్వరలో కొత్త పార్టీ:** బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత.. తెలంగాణ జాగృతి సంస్థను తన రాజకీయ క్షేత్రంగా మార్చుకున్నారు. త్వరలోనే కొత్త పార్టీ పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి అభ్యర్థులు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీ చేసి బలపరీక్షను ఎదుర్కొన్నారు.

### బంధాల్లేవ్.. బంధుత్వాల్లేవ్..
### ఆత్మీయతల్లేవ్.. అనుబంధాల్లేవ్.. అంతా రాజకీయమే!
### ఫ్యామిలీస్ కన్నా పాలిటిక్సే ఫస్ట్!!

రాజకీయాల్లో ఆరితేరిన నాయకుల ఇండ్లల్లో ఇది కామన్ గా తయారైంది. తండ్రీకొడుకులు, మామాఅల్లుళ్లు, తోడికోడళ్లు, అన్నాదమ్ములు, అన్నాచెల్లెళ్లు, బాబాయ్ అబ్బాయిలు.. ఇలా ఎవరికి వారు యమునా తీరు, ఎవరి కుంపటి వారిదే!! కొందరు సొంత బలం, బలగంతో రాజకీయంగా రాణిస్తే.. ఇంకొందరు మధ్యలోనే కాడి వదిలేస్తున్నారు. ఇందిరమ్మ కోడళ్లు సోనియాగాంధీ, మేనకాగాంధీ మొదలు.. అటు ఏపీలో వైఎస్సార్ ఫ్యామిలీ, ఇటు తెలంగాణలో కల్వకుంట్ల ఫ్యామిలీ వరకు ఇదే పరిస్థితి!! ఫ్యామిలీస్ వర్సెస్ పాలిటిక్స్‌పై **కలం 360 డిగ్రీస్** స్పెషల్..

– తెలంగాణ బ్యూరో, కలం





## వైఎస్సార్ ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం:**

వైఎస్ రాజశేఖర్ రెడ్డి, విజయమ్మ దంపతుల పిల్లలు జగన్, షర్మిల. వైఎస్ తమ్ముడు వివేకానంద రెడ్డి. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ అంటే రాజశేఖర్ రెడ్డి అనే స్థాయిలో ఆయన పేరు వినిపించింది.

**విభేదాలు:**

2009లో వైఎస్సార్ చనిపోయాక కాంగ్రెస్ నుంచి జగన్ బయటకొచ్చారు. 2011లో వైసీపీని స్థాపించారు. ఆ టైమ్‌లో ఆయన వెంట చెల్లి, తల్లి ఉన్నారు. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం అయ్యారు. ఇదే క్రమంలో వివేకానంద రెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందడంతో కుటుంబ విభేదాలు బయటపడ్డాయి. వైసీపీ నుంచి షర్మిల బయటకు వచ్చేశారు.

**కొత్త పార్టీ పెట్టి..:**

వైసీపీ నుంచి బయటకు వచ్చాక షర్మిల.. 2021లో తెలంగాణలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించారు. కొన్నాళ్లు తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి.. అనంతరం కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.



## కరుణానిధి ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం:** తమిళనాడును ఏలిన డీఎంకే వ్యవస్థాపకుడు కరుణానిధికి ముగ్గురు భార్యలు, ఆరుగురు సంతానం. ఇందులో నలుగురు కుమారులు.. ఇద్దరు కూతుళ్లు. మొదటి భార్య పద్మావతి కుమారుడు ఎంకే ముత్తు. రెండో భార్య దయాళు అమ్మాళ్ కుమారులు ఎంకే అళగిరి, ఎంకే స్టాలిన్, ఎంకే తమిళరసు, కుమార్తె సెల్వి. మూడో భార్య రాజాత్తి కూతురు కనిమొళి.

**విభేదాలు:** కరుణా నిధి తన రాజకీయ వారసుడిగా ఎంకే స్టాలిన్‌ను ప్రకటించడం అళగిరికి నచ్చలేదు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, స్టాలిన్ పై విమర్శలు చేయడంతో అళగిరిని డీఎంకే నుంచి బహిష్కరించారు. 2018లో కరుణానిధి చనిపోయాక పార్టీ పగ్గాలను స్టాలిన్ చేపట్టారు.

**బల ప్రదర్శనకు ప్రయత్నించి..:** అళగిరి తన బలాన్ని ప్రదర్శించాలని ప్రయత్నించారు. తండ్రి ఆశయాల సాధన కోసం ‘కలైంజ్ఞర్ ధర్మరక్షణ పడై’ వంటి వేదిక ద్వారా ఆ ప్రయత్నం చేశారు. 2021లో సొంతగా పార్టీ పెడుతారన్న ప్రచారం జరిగింది. కానీ.. చివరికి సైలెంట్ అయ్యారు.



## ఇందిరా ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం:** దేశానికి తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ. ఆమెకు ఇద్దరు కొడుకులు రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ. రాజీవ్ భార్య సోనియా.. సంజయ్ భార్య మేనక. 1984లో ఇందిరా గాంధీ అకాలమృతి తర్వాత రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. అంతకుముందు 1980లో ఆమె మరో కొడుకు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో చనిపోయారు. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆకస్మికంగా మృతి చెందారు.

**విభేదాలు :** సంజయ్ గాంధీ మరణంతో ఇందిర కుటుంబంలో చీలిక మొదలైంది. 1982లో మేనకా గాంధీ.. లక్నోలో రాజకీయ సభ పెట్టారు. దీంతో ఆమెపై ఇందిర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కుటుంబంలో విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీ నుంచి మేనక బయటకు వచ్చారు.

**కొత్త పార్టీ పెట్టి..:** ఇందిరమ్మ ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత మేనకా గాంధీ తన భర్త ఆశయాల కోసం మొదట ‘సంజయ్ విచార్ మంచ్’ అనే సంస్థను స్థాపించారు. దాన్ని 1983 ఏప్రిల్ లో రాజకీయ పార్టీగా మలచారు. అదే టైమ్‌లో రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. అనంతరం జనతా దళ్‌లో చేరి 1988 లో కేంద్ర మంత్రి అయ్యారు. 2004లో కుమారుడు వరుణ్ గాంధీ కలిసి బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలోనే సోనియాగాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ, కూతురు ప్రియాంక కొనసాగుతున్నారు.



## నందమూరి ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం:** తెలుగు సినీ ఇండస్ట్రీని ఏలి, తెలుగు దేశం పార్టీని స్థాపించి, ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా పనిచేసిన నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కు ఎనిమిది మంది కుమారులు, నలుగురు కూతుళ్లు. వీళ్లలో నందమూరి హరికృష్ణ, నందమూరి బాలకృష్ణ ఇటు సినిమాలతో పాటు రాజకీయాల్లోకి వచ్చారు. కూతురు దగ్గుబాటి పురందేశ్వరి కూడా రాజకీయాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ కూతురు భువనేశ్వరి భర్త చంద్రబాబు మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు.

**విభేదాలు :** ఎన్టీఆర్ రెండో భార్య లక్ష్మీపార్వతి జోక్యం పార్టీలో పెరిగిందన్న భావంతో ఎన్టీఆర్ పై అప్పట్లో కుటుంబ సభ్యులు, చంద్రబాబు తిరుగుబాటు చేశారు. 1995లో వైస్రాయ్ హోటల్‌లో ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టారు. అదే ఏడాది సెప్టెంబర్ 1న సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. 1995లో టీడీపీలో రాజకీయ సంక్షోభం తర్వాత కొన్నాళ్లకు ఎన్టీఆర్ మరణించారు. అనంతరం లక్ష్మీపార్వతి ‘ఎన్టీఆర్ తెలుగుదేశం’ పార్టీని స్థాపించారు. హరికృష్ణ కూడా తండ్రి మృతి తర్వాత కొన్నాళ్లు టీడీపీలోనే కొనసాగి, అనంతరం విభేదాలతో బయటకొచ్చారు.

**అన్న తెలుగుదేశం పార్టీ పెట్టి..:** టీడీపీ నుంచి బయటకు వచ్చి 1999లో హరికృష్ణ ‘అన్న తెలుగుదేశం’ పార్టీని స్థాపించారు. తండ్రి ఆశయాలను కొనసాగిస్తానని ప్రకటించారు. తర్వాత హరికృష్ణ మళ్లీ టీడీపీలో చేరారు.

కిడ్నీ ఇచ్చినా పార్టీలో ఉండనివ్వలే.. - 2వ పేజీలో

కలం 360° ప్రజల గళం...
20-02-2026, శుక్రవారం



# పాలిటిక్స్.. ఫ్యామిలీస్ బ్రేకప్



## పాశ్వాన్ ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

బిహార్ రాజకీయాల్లో రామ్ విలాస్ పాశ్వాన్‌ను దళిత పులి అని పిలుస్తారు. ఈయనకు ఇద్దరు తమ్ముళ్లు పశుపతి కుమార్ పరాస్, రామ్‌చంద్ర పాశ్వాన్. రామ్ విలాస్ పాశ్వాన్ కొడుకు చిరాగ్ పాశ్వాన్.

**విభేదాలు**

2020లో రామ్ విలాస్ పాశ్వాన్ చనిపోయాక ఆయన కొడుకు చిరాగ్ పాశ్వాన్, బాబాయ్ పశుపతి కుమార్ పరాస్ మధ్య విభేదాలు వచ్చాయి. పార్టీ పగ్గాల కోసం బాబాయ్, అబ్బాయ్ మధ్య గొడవ మొదలైంది. 2021 జూన్‌లో లోక్ జనశక్తి పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీల్లో ఐదుగురు పశుపతి పరాస్ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. 2021 అక్టోబర్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ లోక్‌జనశక్తి పార్టీ పేరును, బంగ్లా గుర్తును ఫ్రీజ్ చేసింది. రెండు వర్గాలకు వేర్వేరు గుర్తులు కేటాయించింది.

**రెండు కొత్త పార్టీలు**

బాబాయ్, అబ్బాయ్ మధ్య చీలిక తర్వాత చిరాగ్ పాశ్వాన్ 'లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)'ని స్థాపించారు. పశుపతి పరాస్ నాయకత్వంలో రాష్ట్రీయ లోక్‌జన్‌శక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ) కొత్త పార్టీ పుట్టుకొచ్చింది.



## పవార్ ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేత శరద్ పవార్. ఆయన పెద్దన్న అనంతరావు పవార్ కొడుకు అజిత్ పవార్. శరద్ పవార్ కూతురు సుప్రియా సూలే. బాబాయ్ శరద్ పవార్ ప్రోత్సాహంతో అజిత్ రాజకీయాల్లోకి వచ్చారు.

**విభేదాలు**

శరద్, అజిత్ మధ్య ఉన్న దశాబ్దాల అనుబంధం కొన్ని కారణాలతో తెగిపోయింది. శరద్ తన కూతురు సుప్రియకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించడం అజిత్‌కు నచ్చలేదు. ఎన్సీపీ సిద్ధాంతపరంగా బీజేపీకి వ్యతిరేకం. పార్టీ మనుగడ, అధికారం కోసం బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని అజిత్ కోరుకుంటే.. శరద్ పవార్ ఒప్పుకోలేదు.

**రెండుగా చీలిన ఎన్సీపీ**

ఎన్సీపీ తనదే అని అజిత్ ప్రకటించుకున్నారు. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ కూడా అజిత్ వర్గానికే అసలైన ఎన్సీపీని కేటాయించింది. శరద్ తన వర్గానికి 'ఎన్సీపీ (శరద్ చంద్ర పవార్)' అని పేరు పెట్టుకున్నారు. కాగా, ఇటీవల విమాన ప్రమాదంలో అజిత్ చనిపోయారు.



## ఠాక్రే ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే! ఆయన కొడుకు ఉద్ధవ్ ఠాక్రే.. బాల్ ఠాక్రే తమ్ముడు శ్రీకాంత్ ఠాక్రే కొడుకు రాజ్ ఠాక్రే. బాల్ ఠాక్రే ఎక్కడ ఉన్నా.. అక్కడ రాజ్ మస్ట్‌గా ఉండేవారు. రాజకీయ వారసుడు ఆయనేనని అందరూ భావించేవారు.

**విభేదాలు**

కేడర్‌లో రాజ్‌కే ఎక్కువ ఆదరణ ఉండేది. అయితే.. 2003లో తన కొడుకు ఉద్ధవ్‌ను శివసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాల్ ఠాక్రే ప్రకటించడంతో విభేదాలు భగ్గుమన్నాయి. 2005 నవంబర్‌లో శివసేన ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజ్ రాజీనామా చేసి బయటకు వచ్చారు.

**ఎంఎన్ఎస్ స్థాపన**

2006 మార్చిలో రాజ్‌ఠాక్రే ఎంఎన్ఎస్ పార్టీని స్థాపించారు. 2019లో మహారాష్ట్ర సీఎం గా ఉద్ధవ్ బాధ్యతలు చేపట్టినప్పుడు రాజ్ తీవ్రంగా విమర్శించారు. ఇలా వీళ్లిద్దరి మధ్య విభేదాలు దాదాపు మూడు దశాబ్దాల పాటు కొనసాగాయి. ఇటీవల ఇద్దరూ ఒకే వేదిక మీదికి రావడం.. ఏకంగా మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం ఆసక్తికరంగా మారింది.



## లాలూ ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి దంపతులకు ఏడుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. రబ్రీదేవి, ఇద్దరు కొడుకులు తేజస్వీ యాదవ్, తేజ్‌ప్రతాప్ యాదవ్, కూతుళ్లు మిసా భారతి, రోహిణి ఆచార్య రాజకీయాల్లో ఉన్నారు. లాలూతోపాటు ఆయన భార్య బిహార్ సీఎంలుగా చేశారు.


**విభేదాలు**

లాలూ తన చిన్న కొడుకు తేజస్వీని రాజకీయ వారసుడిగా ప్రకటించి ఆర్జేడీ బాధ్యతలు అప్పగించారు. ఇది తేజ్‌ప్రతాప్, మిసా భారతి, రోహిణి ఆచార్యకు నచ్చలేదు. బాధ్యతారాహిత్యంగా ప్రవరిస్తున్నారని 2025 మేలో తేజ్‌ను ఆర్జేడీ నుంచి బహిష్కరించారు. 2025 నవంబర్‌లో రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు, కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటున్నట్లు ప్రకటించారు. ఈమె తన తండ్రి లాలూకు అప్పట్లో కిడ్నీని కూడా దానం చేశారు.



**పార్టీ పెట్టి..**

2025 సెప్టెంబర్ 26న తేజ్‌ప్రతాప్ 'జన్‌శక్తి జనతా దళ్ పార్టీ' ప్రకటించి, అసెంబ్లీ ఎన్నికల్లో దిగినా ఒక్క సీటూ రాలేదు.



## ములాయం ఫ్యామిలీ

**కుటుంబ నేపథ్యం**

ఉత్తరప్రదేశ్ రాజకీయాలు అనగానే గుర్తుకొచ్చేది ములాయం సింగ్ యాదవ్ ఫ్యామిలీ. ములాయం సింగ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మాల్తీ దేవి కొడుకు అఖిలేశ్ యాదవ్. రెండో భార్య సాధనా గుప్తా కొడుకు ప్రతీక్ యాదవ్. ములాయం తమ్ముడు శివపాల్ యాదవ్. ధర్మేంద్ర యాదవ్, అక్షయ్ యాదవ్, ఆదిత్య యాదవ్.. ములాయం తమ్ముళ్ల కొడుకులు.

**విభేదాలు**

శివపాల్ యాదవ్, అఖిలేశ్ యాదవ్ మధ్యే విభేదాలు నడిచాయి. ములాయం తన కొడుకు అఖిలేశ్‌ను 2012లో సీఎం చేయడం శివపాల్‌కు నచ్చలేదు. పార్టీ జాతీయ అధ్యక్ష పదవి కూడా అఖిలేశ్‌కే దక్కింది. ములాయంకు దగ్గరగా ఉండే పార్టీ కీ లీడర్ అమర్ సింగ్‌తో అఖిలేశ్‌కు పడకపోయేది. కానీ, అమర్‌సింగ్‌కు శివపాల్ మద్దతు ఇవ్వడంతో బాబాయ్, అబ్బాయ్ మధ్య అగాథం ఏర్పడింది. 2017లో శివపాల్‌ను అఖిలేశ్ తన కేబినెట్ నుంచి తొలగించారు. 2018లో సమాజ్‌వాదీని శివపాల్ వీడారు.

**కొత్త పార్టీ..**

2018లో శివపాల్ 'ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ (లోహియా)–పీఎస్‌పీ(ఎల్)' స్థాపించారు. ఇటీవల శివపాల్ యాదవ్ మళ్లీ ఎస్పీలో చేరి కీలక నేతగా ఉన్నారు.